క్లుప్తంగా

ప్రత్యామ్నాయ భవనాలు సమకూర్చాలి



హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

హిందూపురం అర్బన్: హిందూపురం న్యాయస్థాన ఆవరణలో ప్రస్తుతం నిర్వహిస్తున్న న్యాయస్థాన భవన సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. ప్రత్యామ్నాయ భవనాలు సమకూర్చాలని కోరుతూ శనివారం ఏపీ హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. హిందూపురాన్ని జిల్లా న్యాయకేంద్రంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కోర్టు ఆవరణలో మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జిని సన్మానించారు. స్పందించిన ఏపీ హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసరెడ్డి వెంటనే జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇతర అధికారులతో మాట్లాడారు. తక్షణం ప్రత్యామ్నాయ భవనాలు సమకూర్చాలను ఆదేశించారు.కార్యక్రమంలో జిల్లా జడ్జి శ్రీనివాసులు, హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సుదర్శన్, జీఆర్ సిద్దూ పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనంతరాజు

రొళ్ల: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశానికి రెవెన్యూ, అటవీ, విద్యుత్, వెలుగు, హార్టికల్చర్, సాంఘిక సంక్షేమశాఖ, ఎక్సైజ్‌శాఖ అధికారులు హాజరు కాకపోవడంపై జెడ్పీటీసీ అనంతరాజు మండిపడ్డారు. అధికారులు హాజరుకాకపోతే సమస్యలు ఎవరికి చెప్పాలని ప్రశ్నించారు. మడకశిర నుంచి రొళ్ల, అగళి మండలాల వైపు ఆర్టీసీ బస్సు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హొట్టేబెట్ట పంచాయతీలో కూటమి నాయకులు చెప్పిన వారికి మాత్రమే ఉలవలు పంపిణీ చేస్తున్నారని సర్పంచ్ ప్రకాష్ ఏఓ రాజ్యలక్ష్మిని నిలదీశారు. వైస్ ఎంపీపీలు రత్నమ్మ, నాగరాజు, ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ క్రిష్ణప్ప, ఎంఈఓ శ్రీధర్, ఏపీఓ ఓబుళప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, క్షేత్రస్థాయి అధికారులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు

హిందూపురం: హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా సంగం శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. హిందూపురంలో పని చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని డీఎంఏకు రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పని చేస్తున్న శ్రీనివాసులును హిందూపురం కమిషనర్‌గా బదిలీ చేశారు. అనంతరం మున్సిపల్ ఆఫీసులో ఉద్యోగులు, సిబ్బంది, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, సచివాలయ కార్యదర్శులు మున్సిపల్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

లేపాక్షి ఎస్‌ఐగా నరేంద్ర

లేపాక్షి: లేపాక్షి నూతన ఎస్‌ఐగా నరేంద్ర శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పుట్టపర్తి పోలీస్ స్టేషన్ నుంచి లేపాక్షికి బదిలీపై విచ్చేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

దేవుడా.. బాబుకు మంచి బుద్ధినివ్వు



మడకశిరలో కోట వేంకటరమణ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఈరలక్కప్ప, నాయకులు



పరిగిలో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



హిందూపురం పేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేయించిన నాయకుడు వేణురెడ్డి, తదితరులు

మడకశిర: తిరుమల లడ్డూపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న సీఎం చంద్రబాబుకు బుద్ధినివ్వు అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలోని కోట వేంకటరమణస్వామిని వేడుకున్నారు. శనివారం స్థానిక వేంకటరమణస్వామి ఆలయంలో పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అనంతరం ఆలయం బయట సీఎం చంద్రబాబు తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల పవిత్రతను మంటగలిపారన్నారు. లడ్డూ అపవిత్రం కాలేదని తెలిసినా చంద్రబాబు తిరుమల ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా చులకన చేశారని ఆరోపించారు. కేవలం వైఎస్ జగన్‌పై ఉన్న రాజకీయ కక్షతో తిరుమల ఆలయాన్ని రాజకీయాలకు చంద్రబాబు వాడుకున్నారని విమర్శించారు. చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి తగిన శిక్ష విధించడం ఖాయమని తెలిపారు. హామీలను అమలు చేయకుండా చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ఇది మంచి ప్రభుత్వం కాదని, ముంచే ప్రభుత్వమన్నారు. వైఎస్ జగన్ తిరుమల పర్యటనను అడ్డుకోవడం దారుణమని ధ్వజమెత్తారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, జెడ్పీటీసీ నరసింహమూర్తి, మండల కన్వీనర్ రామిరెడ్డి, మాజీ డైరెక్టర్ నాగరాజగౌడ్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, కౌన్సిలర్లు విక్రమ్,నాగేంద్ర,తిమ్మక్క, నాయకులు నాగభూషణ్‌రెడ్డి, అంజలి, రాజశేఖర్, నాగరాజు, జయరాజ్, మధు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: తిరుమల లడ్డూపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్న సీఎం చంద్రబాబుకు బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూజలు నిర్వహించారు. అసత్య ప్రచారం మానుకోవాలని నిరసన వ్యక్తం చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఆనందరంగారెడ్డి, జెడ్పీటీసీ సరోజమ్మ, మాజీ సర్పంచులు నారాయణరెడ్డి, కల్లుమర్రి శ్రీరాములు, మాజీ డైరెక్టర్ నాగరాజగౌడ్, సర్పంచ్ పుట్టమ్మ, మండల కన్వీనర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

అగళి: సీఎం చంద్రబాబుకు బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు నిర్వహించారు. మండల కన్వీనర్ సూడీయో శ్రీనివాస్, ఎంపీపీ రేణుక ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమరాపురం: తిరుమల లడ్డూపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్న సీఎం చంద్రబాబుకు బుద్ధిని ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు వేడుకున్నారు. శనివారం అమరాపురంలోని చోళమాంబ దేవికి రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్ ఆధ్వర్యంలో, హేమావతి శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. వలస, హలుకూరు, బసవనపల్లి, ఆలదపల్లి, కె.శివరం, నిద్రగట్ట, తమ్మడేపల్లి తదితర పంచాయతీ కేంద్రాల్లో పూజలు నిర్వహించారు.

గుడిబండ: తిరుమల లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబుకు బుద్ధి ప్రసాదించాలని స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో నాయకులు పూజలు చేశారు. మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, జెడ్పీటీసీ భూతరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ శివకుమార్, గిరిధర్, సర్పంచులు కరుణాకర్, రంగస్వామి, నాయకులు రాయుడు, యువరాజు, గిరి పాల్గొన్నారు.

రొళ్ల: తిరుమల లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబుకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి ఆలయంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, ఆవినకుంట ఆంజనేయస్వామి ఆలయంలో ఎంపీపీ కవిత, ఎం.రాయాపురం కోడి ఆంజనేయ స్వామి ఆలయంలో పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు మాట్లాడుతు తిరుమల వెంకటేశ్వరస్వామి ప్రసాదంలో జంతువుల కొవ్వును కలుపుతున్నారని చంద్రబాబు ప్రచారం చేయడం దారుణమన్నారు.

రొద్దం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, నాయకులు అక్కులప్ప, సి.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, నరేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిలకల రవి, బి.నరసింహులు, జెట్టి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రసాదాన్ని అపవిత్రం చేశారు

హిందూపురం: పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదాన్ని సీఎం చంద్రబాబు అపవిత్రం చేశారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తూమకుంట చెక్‌పోస్ట్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేయించారు. లడ్డూ పవిత్రపై అపవాదు వేసిన పాపాన్ని క్షమించాలని వేంకటేశ్వర స్వామికి పూజలు చేపట్టారు. అనంతరం చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో అబద్ధాలు చెబుతున్నారన్నారు. ఇందుకు తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. భక్తుల మనోభావాలతో రాజకీయాలు చేయడం తప్పని హితవు పలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామాంజి, ఎంపీటీసీ కృష్ణవేణి, సర్పంచ్ దేవరాజు, నాయకులు రంగనాథ్, నంజప్ప, రామాంజి, రాము, తిమ్మరెడ్డి, చంద్ర, తిమ్మి రెడ్డి, మంజు, గంగాధరప్ప, సుధాకర్ రెడ్డి, బాబు రెడ్డి పాల్గొన్నారు.

హిందూపురం: మెయిన్ బజార్‌లోని పేట వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున పూజలు చేపట్టారు. సీఎం చంద్రబాబు లడ్డూపై అసత్య ఆరోపణలు చేసినందుకు నిరసనగా ఆలయం రాజగోపురం వద్ద 101 టెంకాయలు కొట్టి, పాప ప్రక్షాళన చేశారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు మాట్లాడిన మాటలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ జరిగి ఉంటే ఎవరి హయాంలో జరిగిందన్న విషయాన్ని కూడా చంద్రబాబు గుర్తు చేసుకోవాలన్నారు. తిరుపతి దర్శనానికి వెళ్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని డిక్లరేషన్ అడగటం దారుణమన్నారు. ప్రధాని, హోంమంత్రితో పాటు ఇంకా ఎందరో వీఐపీలతో కలిసి వెళ్లిన సమయంలో గుర్తుకు రాని డిక్లరేషన్ ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. పవిత్ర తిరుమల లడ్డూ ప్రసాదంపై రాజకీయం చేయడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణ కన్వీనర్ మన్సూర్, మండల కన్వీనర్ రాము, కౌన్సిలర్లు శివ, రామచంద్రా, నాగేంద్ర, జిల్లా యువజన అధ్యక్షులు లోకేష్, మహేష్, చంద్రశేఖర్, ప్రశాంత్‌గౌడ్, గిరి, శ్రీన, శివశంకర్‌రెడ్డి, ఆయుబ్‌బేగ్, ఫరూక్, సర్పంచులు అశ్వర్థనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎమ్పీటీసీలు రామకృష్ణారెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, ధనంజయరెడ్డి, రామాంజి, రాము పాల్గొన్నారు.

లేపాక్షి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో పాటు కూటమి ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించు స్వామి అని వైఎస్సార్‌సీపీ నాయకులు వేడుకున్నారు. హిందూపురం పట్టణంలోని లక్ష్మీపురంలో వెలసిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మండల కన్వీనర్ నారాయణ స్వామి ఆధ్వర్యంలో కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజిన రెడ్డి, లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఉదయకుమార్, నాయకులు రామ్మూర్తి, తిప్పన్న, జేకే ప్రభాకర్, చరణ్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: వరసిద్ధి వినాయకుడి గుడిలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు.పార్టీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, గోరంట్ల ఉపసర్పంచ్ రాజారెడ్డి, శంకర, జెడ్పీటీసీ జయరాంనాయక్ , నాయకులు గొల్ల లక్ష్మీనారాయణ, వాసుదేవరెడ్డి, మురళీధర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, బయపరెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, ఎంపీటీసీ సోముశేఖర్, మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి, ముస్లిం, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: అడదాకులపల్లిలో ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచు అలివేలమ్మ, వెంకటరామిరెడ్డి, రాఘవరెడ్డి, అంజనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మడకశిర మండలం మెళవాయిలో పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



అగళిలో పూజలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



అమరాపురంలో చోళమాంబ దేవికి పూజలు నిర్వహిస్తున్న నాయకులు



రొద్దంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న నాయకులు



పూజల్లో పాల్గొన్న చౌళూరు మధుమతిరెడ్డి, పార్టీ నాయకులు



పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రొళ్ల మండలం కొత్తపాళ్యంలో ..

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్ర

- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పెనుకొండ: పాలన చేతకాక, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సీఎం చంద్రబాబు రాజకీయ కుట్రలకు తెరలేపారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ విమర్శించారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై కూటమి నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని, పాప ప్రక్షాళన చేయాలని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, నాయకులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి (కౌన్సిలర్) టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, రాష్ట్ర బోయ, వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, గజేంద్ర, జెడ్పీటీసీ అశోక్, శ్రీకాంత్‌రెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్ తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ జగనన్న తిరుమలకు వస్తున్నారంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్‌లు, ఎంపీపీలు ఇతర ముఖ్య నేతలకు నోటీసు జారీ చేశారని, కూటమి నేతలకు ఎందుకంత భయమని ఆమె నిలదీశారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేయడానికి ప్రయత్నించిన వారికి తగిన విధంగా శిక్షించాలని మనసారా వేడుకున్నట్లు తెలిపారు. ఎంతో పవిత్రత కలిగిన వేంకటేశ్వరస్వామి ప్రతిష్టను రాజకీయంగా వాడుకోవడం తగదని, ఇలాంటి చౌకబారు పనులు మానుకోవాలని చంద్రబాబు, కూటమి నాయకులను మాజీ మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో ముఖ్యనాయకులు కౌన్సిలర్ తయూబ్, శేషాద్రి, జయప్ప, సర్పంచ్ నాగరాజు, మాజీ సర్పంచ్ రమాకాంతరెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు సూర్యప్రకాష్‌రెడ్డి, బోయబాబు, గణేష్, యాసిన్, కృష్ణారెడ్డి, నరసింహమూర్తి, సాదరి శీనా, కిరణ్, చెన్నకేశవ, కొండలరాయుడు, ఇమావలి, శ్రీరాములు, వెంకటేశులు, రాజ్‌గోపాల్‌రెడ్డి, కళ్యాణ్, కిష్ట నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిగి: సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు దేవుడా.. అని శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కోరుకున్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నుతో పెట్టిన విద్య అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని రాజకీయంగా వినియోగించుకుంటున్నారన్నారు. రాష్ట్రాన్ని పాలన చేయడం చేతకాక అసత్య ప్రచారం చేస్తున్న చంద్రబాబును శిక్షించాలని ఆదేవదేవుడిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, మంజునాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మీ, లింగమ్మ, మారుతీరెడ్డి, చిక్కన్న, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, ముఖ్య నాయకులు సింగారెడ్డి, బద్రీ, రఫీక్‌ఖాన్, జయచంద్రారెడ్డి, గిరి, మాజీ సర్పంచ్‌లు నాగరాజు, గోవిందరెడ్డి, మాజీ ఎంపీపీ గోవిందప్ప, మాజీ మండల కన్వీనర్ జయరాం, పూల చౌడప్ప, శ్రీరామరెడ్డి, జేసీఎస్ రెడ్డి, డీలర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పని చేయండి



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన హిందూపురం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పని చేస్తూ పార్టీని మరింత బలపేతం చేయాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి ఆధ్వర్యంలో శనివారం తాడేపల్లిలోని పార్టీ క్యాంప్ ఆఫీసులో వైఎస్ జగన్‌ను మున్సిపల్ వైస్ చైర్మెన్లు, ఎంపీపీ, కౌన్సిలర్లు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలు ఆదరిస్తారని వైఎస్ జగన్ తెలిపారు. త్వరలో మంచి రోజులు వస్తాయని.. అందరూ కలిసికట్టుగా ప్రజల పక్షాన నిలిచి పోరాడాలని సూచించారు.

దాతల సహకారం అభినందనీయం

అమరాపురం: దాతల సహకారం అభినందనీయమని సీడీపీఓ శాంతాలక్ష్మి పేర్కొన్నారు. గౌడనకుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామానికి చెందిన అమెరికాలో స్థిరపడిన సుధాకర్, బెంగళూరులో స్థిరపడిన వీరేష్ రూ.2 లక్షలతో అందంగా తయారు చేశారు. అలాగే తమ్మడేపల్లి పంచాయతీలోని పది అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ప్లేటు, గ్లాసులు, మెడికల్ కిట్‌ను అందజేయడంతో సీడీపీఓ వారిని సన్మానించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెడికల్ కిట్‌ను ఎంఈఓ రాఘవయ్యకు దాతలు సుధాకర్, వీరేష్ అందజేశారు. ఎంఈఓ రాఘవయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ, ఉపాధ్యాయులు నాగరాజు, లింగేష్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్-1గా రాజశేఖర్

హిందూపురం టౌన్: హిందూపురం సబ్ రిజిస్ట్రార్-1గా రాజశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. హిందూపురం రియల్ ఎస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రియాజుల్లా ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు సబ్ రిజిస్ట్రార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లక్ష్మీనారాయణ, ఉత్తన్న, రియాజ్, నూరుల్లా, జబీవుల్లా, రామాంజి, వలీ, యాకుబ్, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న జి.భువనశ్రీ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, పీఈటీ ఆదినారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గత నెల హిందూపురంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో జి.భువనశ్రీ సత్తా చాటినట్లు పేర్కొన్నారు. కర్నూలులో అక్టోబర్ 5 నుంచి 7 వరకూ జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలో పాల్గొంటుందన్నారు.

హిందూపురం అర్బన్: సి.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్‌లో జి.గణేష్, జునాయిద్, అరుణ్, 200 మీటర్ల పరుగు పందెంలో మనోజ్, సతీష్ సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ అశోక్ నాయక్, ఉపాధ్యాయులు తెలిపారు.



హిందూపురం అర్బన్: విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా క్రీడా పోటీలు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ గంగప్ప ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా తదితర క్రీడాంశాల్లో మండలంలోని అన్ని యాజమాన్యాల నుంచి 39 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డీఈ రమేష్ కుమార్, ఎంజీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం, పీడీలు లోక్‌నాథ్, రామకృష్ణ, సురేష్ కుమార్, శ్రీనివాసులు, నాగమణి, సరళ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

రొద్దం: మండలంలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏపీ స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ శ్రీదేవి శనివారం తెలిపారు. కొడిగిన హళ్లి ఆర్‌ఎస్ క్రీడా మైదానంలో నిర్వహించిన డివిజన్ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు జాబిలి చాంద్‌బాషా, వెంకటేసులు, పోతులయ్య, రమేష్, హసీన పాల్గొన్నారు.

అగళి: మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జాఫార్, పీఈటీ నారాయణస్వామి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పావగడ: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మహాత్మగాంధీ క్రీడా మైదానంలో శనివారం గంగ కళ్యాణి పథకం కింద బోరు బావులు తవ్వించిన లబ్ధిదారులకు పంపు మోటార్, పైపులు, విద్యుత్ పరికరాలు ఆయన అందించారు. రాష్ట్ర వడ్డెర అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎస్ రవికుమార్, మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, టెంకాయల రవి, అంబేడ్కర్ అభివృద్ధి మండలి జిల్లా వ్యవస్థాపకుడు మంజునాథ్, తాలూకా అభివృద్ధి అధికారి హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షురాలి మృతి

పావగడ: స్థానిక మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షురాలు లీలావతి(70) అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. ఈమె 1996-2001లో కాంగ్రెస్ తరపున మున్సిపల్ ఉపాధ్యక్షురాలిగా పని చేశారు. ఆమె మృతి పట్ల స్థానిక మున్సిపల్ చైర్మన్ రాజేశ్, కౌన్సిలర్ బాల సుబ్రహ్మణ్యం, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సుదేశ్ బాబు తదితరులు తీవ్ర సంతాపం వెలిబుచ్చారు.

ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన

రొద్దం: మండల కేంద్రంలోని హౌసింగ్ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ మాట్లాడుతూ కాలనీలో ఐదు నెలల్లోపు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోని, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

పరిగి: పరిగి పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను శనివారం పంపిణీ చేశారు. దసరా పండుగను పురస్కరించుకొని పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల, వాటర్‌మెన్లకు సర్పంచ్ లక్ష్మీదేవి, సెక్రటరీ అరుణ చేతుల మీదుగారెండు జతల చొప్పున దుస్తులు పంపిణీ చేశారు. కార్యాలయ సిబ్బంది గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

రొళ్ల: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి పేర్కొన్నారు. శనివారం రత్నగిరి గ్రామంలో మడకశిర వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని కళ్యాణి బావులు, గ్రామవీధులు, కొళాయిల వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు డాక్టర్ మురళీకృష్ణ, మంజుళ పాల్గొన్నారు.

వైద్య సేవలపై అవగాహన కల్పించాలి

హిందూపురం టౌన్: ఆధునిక వైద్య సదుపాయాలు, సేవలపై గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యులకు అవగాహన కల్పించే బాధ్యతను విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లే తీసుకోవాలని స్థానిక ఎన్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి అన్నారు. శనివారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర 2047- మీ విజన్-మా మిషన్'లో భాగంగా సాంకేతికతతో కూడిన అందుబాటులో ఉండే వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చర్చా గోష్ఠి అనంతరం కళాశాలలో భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.